నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 4 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 3 : ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లో విధులు నిర్వహించే ఉద్యోగుల కోసం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండలాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ దాసరి వేణు, రాజస్వ మండలాధికారి లోకేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ దండె విఠల్

మండల కేంద్రంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్, మే 3 : మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఈ నెల 5న నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సభా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపిస్తాయన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జన సమీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామగోని శంకర్ గౌడ్, బిట్టు శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, నౌనురి శ్రీనివాస్, కొల్లిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధినేత వచ్చేస్తున్నారు..

నేడు మంచిర్యాలలో కేసీఆర్ భారీ రోడ్ షో

- గులాబీ బాస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- విజయవంతం కోసం ఏర్పాట్లలో నేతలు
- ఢీలాపడుతున్న ప్రత్యర్థి పార్టీలు



మంచిర్యాల, మే 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాక కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు, శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఆ సమయం వచ్చేసింది. నేడు మంచిర్యాలలో బాస్ రోడ్ షో నిర్వహించనుండగా, విజయవంతం చేసేందుకు గులాబీ సైన్యం అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా ఏప్రిల్ 24న కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించిన విషయం విదితమే. మిర్యాలగూడ నుంచి మొదలైన కేసీఆర్ సమర శంఖారావం.. ప్రధాన నగరాలను తాకుతూ పెద్దపల్లి పార్లమెంట్‌కు చేరుకున్నది. గోదావరిఖనిలో శుక్రవారం రాత్రి 8 గంటలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహించగా, శనివారం సాయంత్రం మంచిర్యాల జిల్లాకు రానున్నది. స్థానిక ఐబీ చౌరస్తాలో భారీ ఎత్తున కేసీఆర్ రోడ్ షో నిర్వహించనుండగా, విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ సైన్యం సన్నద్ధమైంది. అధినేత బస్సుయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. ఈ క్రమంలో ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటూ వచ్చిన మంచిర్యాల జిల్లా వాసులు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సభలో ఏం మాట్లాడుతారా.. అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. పదేళ్ల పాలనలో తమకు అండగా నిలిచిన రైతుబాంధవుడి కోసం అటు అన్నదాతలు, సింగరేణిని లాభాల బాట పట్టించి తమ జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడి కోసం సింగరేణి కార్మికులు, నెలనెలా పింఛన్లు ఇచ్చి ఆదుకున్న పెద్దకొడుకు కోసం పింఛన్‌దారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ రాక కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.

పోరుబాటకు నీరా'జనం'

పోరుబాట పేరుతో గులాబీ దళపతి కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు అడుగడుగునా నీరా'జనం' పడుతున్నారు. ఎనిమిది రోజుల పాటు నిరంతరాయంగా సాగిన రోడ్‌షోలు విజయవంతమయ్యాయి. కేసీఆర్ బయటికి వచ్చి పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాధించిన విజయాలను జనాలకు వివరిస్తూనే, గడిచిన నాలుగు నెలల్లో కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఆయన బయట ప్రచారం చేస్తే తమకు నష్టమని గ్రహించిన ప్రత్యర్థి పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేసి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారంపై ఆంక్షలు విధించింది. ప్రచారంపై నిషేదం అనంతరం శుక్రవారం రాత్రి 8 గంటలకు గోదావరిఖనిలో రోడ్‌షో సాగునున్నది. దీంతో కేసీఆర్ ఏం మాట్లాడుతారనే ఉత్సుకత మరింత పెరిగింది. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ దూకుడు మరింత పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరవు ఛాయలు రాష్ట్రాన్ని ముంచెత్తడం, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న కాంగ్రెస్‌పై జనం విసుగెత్తిపోయారు. నాటికీ.. నేటికీ పరిస్థితులను పోల్చి చూసుకుంటూ బీఆర్ఎస్‌కు జై కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే ఇటు పెద్దపల్లి, అటు ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు ఎక్కడికి వెళ్లినా జనం ఆదరిస్తున్నారు. మండలాల్లో నిర్వహించే సమావేశాలకు భారీగా జనాలు హాజరవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ రోడ్‌షో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూర్చనున్నది. ఒక్కసారి సార్ వస్తే ఫలితాలు మొత్తం మారిపోతాయంటూ ప్రజలే చర్చించుకుంటున్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే బాగుండేనంటూ కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకుంటున్నారు.

ఢీలాపడుతున్న ప్రత్యర్థి పార్టీలు..

కాంగ్రెస్ నాలుగు నెలల పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఆరుగ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగిలినవి అమయలు చేయడంలో విఫలమయ్యింది. నెలకు రూ.2500 వస్తాయని ఆశపడితే.. ఉచిత బస్సు ఒకటి ఇచ్చి.. మోసం చేశారంటూ మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఉచిత కరంట్ ఒక నెల ఇచ్చి ఆపేశారనే ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు ఇచ్చిన హామీలు రైతుబంధు, రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అమలును పాలకులు మరచిపోయారని అన్నదాతలు మండిపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ ఇబ్బందులు ఎదురవుతుండడంతో అధికార పార్టీ అంటేనే అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. దీంతో ప్రజల్లో మద్దతు కూడగట్టుకునేందుకు 'హస్తం' పార్టీ నానా అవస్థలు పడుతున్నది. మరోవైపు తెలంగాణ అంటేనే ఇష్టపడని మోదీకీ.. తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా, నవోదయ కాలేజీలు ఇవ్వకుండా అన్యాయం చేసిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలనే ఆలోచన ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ బస్సు యాత్రతో ప్రత్యర్థి పార్టీలు మరింత ఢీలాపడిపోతున్నాయి. ఫలితాలపై ఈ బస్సు యాత్ర ప్రభావం చూపడం ఖాయమని, భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారనే అభిప్రాయాలు అటు ప్రజలతో పాటు ఇటు పార్టీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాంపూర్ 9వ వార్డులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలి

మంచిర్యాలలోని లక్ష్మీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

- అన్ని వర్గాలను కాపాడుకునే బీఆర్ఎస్‌నే గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- మంచిర్యాలలోని పలు కాలనీల్లో ప్రచారం

మంచిర్యాలటౌన్, మే 3 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని 28వ వార్డు లక్ష్మీనగర్, వడ్డెరకాలనీల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలనను గాలికి వదిలేసిందని, సాగు, తాగు నీరు ఇవ్వాలన్న ఆలోచనే లేదని, పంటలు ఎండుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉండేవారని, కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలను కాపాడుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గాదెసత్యం, అంకం నరేశ్, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, పల్లపు రాజు, శంకర్, బాపు, తాజుద్దీన్, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే

శ్రీరాంపూర్, మే 3 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి వాడ వాడలా, ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని, దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని గుర్తు చేశారు. సింగరేణి స్థలాల్లో నివాసముంటున్న వాటర్ ట్యాంక్ ఏరియాలో 400 మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని కొనియాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి పవన్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, తిరుమల్‌రావు, బూరుగు సత్యనారాయణ, రవిగౌడ్, పెట్టం నరేశ్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జిల్లా జోలికొస్తే ఊరుకోం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- కుమ్రం భీం స్ఫూర్తితో ఉద్యమిస్తాం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్,మే 3 : రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల కుదింపు యోచనలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లా జోలికొస్తే ఊరుకునేది లేదని, కుమ్రం భీం స్ఫూర్తితో ఉద్యమిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లాలో తిరగలేరని హెచ్చరించారు. జిల్లాల కుదింపు ఆలోచన మానుకోవాలని సూచించారు. జిల్లా ఏర్పాటు తర్వాత ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, జిల్లాను తొలగిస్తే అభివృద్ధి కుంటుపడి ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. మోసపూరిత గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదోవ పట్టించే కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కుమ్రం భీం ప్రాజెక్టు నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, దాని నాణ్యతా లోపానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యులన్నారు. కాలువలు పూర్తికాకముందే అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించిన విషయం మర్చిపోయారా అని గుర్తు చేశారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉంటేనే అభివృద్ధి చేస్తారా... లేకుంటే చేయరా అని సీఎం ను ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి జిల్లా అభివృద్ధికి ఎలాంటి హామీ ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు అహ్మద్, వెంకన్న, కార్తీక్, అశోక్, ఇర్ఫాన్, నిసార్ పాల్గొన్నారు.

నీరా'జనం'..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రామగుండంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం నిర్వహించిన రోడ్ షోకు జనం నీరా'జనం' పలికింది. ఆయా ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, సింగరేణి కార్మికులు, ప్రజలు వేలాదిగా తరలిరాగా, ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. గులాబీ బాస్ మాట్లాడుతున్నంత సేపు ఆయా వర్గాల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ఎండగట్టారు. సింగరేణిని ముంచిందే కాంగ్రెస్ అని, ఆ పార్టీ పట్ల కార్మికులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే తెలంగాణ హక్కులు కాపాడుకోగలుగుతామని, సింగరేణి మనది మనకు ఉంటదని కేసీఆర్ చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేసీఆర్ పేర్కొనగా, జనం కేరింతలు కొడుతూ జేజేలు పలికారు.

పెద్దపల్లి రాష్ట్రమట..!

సోషల్ మీడియాలో వైరల్

మాట్లాడుతూ తడబడిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వంశీ, పక్కన వివేక్

మంచిర్యాలటౌన్, మే 3 : పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తడబడ్డాడు. శుక్రవారం మంచిర్యాలలో తన తండ్రి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ జైపూర్ పవర్ ప్లాంటు వేరే రాష్ట్రానికి పోతుంటే.. తన తండ్రి వివేక్ కొట్లాడి మరీ దాన్ని పెద్దపల్లి రాష్ట్రానికి తీసుకువచ్చారని చెప్పుకొచ్చాడు. ఈ వీడియో క్లిప్పింగ్ ఎక్స్‌లో తెగ వైరల్ అయ్యింది. పెద్దపల్లి రాష్ట్రం ఏంటి నాయనా... సింగరేణి పవర్ ప్లాంట్ పక్క రాష్ట్రానికి ఎలా వెళ్తుంది... అబద్ధాలు చెప్పడం మొదలు పెట్టావా నాయనా... కుటుంబ పాలన ప్రతినిధి... మీకు మీ కుటుంబానికి దండం అంటూ నెటిజన్లు ట్రోల్ చేశారు.

పీఎస్సార్‌కు కోడ్ వర్తించదా..?

నర్సింగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

హాజీపూర్, మే 3 : కాంగ్రెస్ పార్టీ నేతలు పార్లమెంట్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి గురువారం రాత్రి మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో జరిగిన ఘటనే ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నది. నర్సింగాపూర్ గ్రామంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గురువారం రాత్రి దాదాపు 11 గంటల దాకా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే పీఎస్సార్ రంజాన్ పండుగ రోజున ఈద్గాలోకి వెళ్లి చెయ్యి గుర్తుకు ఓటేయాలని ప్రచారం నిర్వహించిన విషయం విదితమే. అలాగే శ్రీరామ నవమి రోజున ఓ ఆలయానికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఈ విషయమై ఎన్నికల సంఘం కేసులు నమోదు చేసింది. గురువారం రాత్రి నిర్వహించిన ప్రచారంపై మరి ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి మరి.

34 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

కోటపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989-1990 విద్యా సంవత్సరం విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటపల్లి, మే 3 : కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989-1990 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపైకి చేరి సంతోషంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. అలాగే 2003-2004లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఉపాధ్యాయులను సత్కరించారు.

అనుమతి లేకున్నా.. ఆపేదెవరు?

- సర్వే నంబర్ 199లో బాహాటంగానే నిర్మాణాలు
- చర్యలు తీసుకోవడంలో విఫలమైన మున్సిపాలిటీ

అనుమతులు తీసుకోకుండా నిర్మించిన షెడ్లు..
వాటి ముందు మురుగుకాలువపై వేసేందుకు సిద్ధం చేస్తున్న సిమెంట్ బిల్లలు

మంచిర్యాల, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా షెడ్లు నిర్మిస్తున్నాడు. మున్సిపాలిటీ నిబంధనలు ఉల్లంఘించి సర్వే నంబర్ 199లో బాహాటంగా షెడ్లు కట్టేస్తున్నాడు. ఈ విషయమై ఏప్రిల్ 22న 'నమస్తే తెలంగాణ'లో 'అనుమతి లేకుండా షెడ్లు' శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. కానీ.. మంచిర్యాల మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఈ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కేవలం అనుమతి తీసుకోవాలంటూ సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో సదరు వ్యాపారి మరింత రెచ్చిపోతున్నాడు. మొన్నటి వరకు ఎవ్వరూ చూడొద్దని రేకులు అడ్డుగా పెట్టిన సదరు వ్యక్తి.. ప్రస్తుతం వాటిని తొలగించి మరీ నిర్మాణాలు చేపడుతున్నాడు. ఇంతటితో ఆగకుండా షెడ్ల ముందున్న మురుగుకాలువ (మోరీ)పై సిమెంట్ బిల్లలు వేసేందుకు నిర్మాణాలు సైతం చేపట్టాడు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. రోడ్ల వెంట ఫుట్‌పాత్‌ల పైనున్న దుకాణాలను తొలగిస్తూ విశ్వరూపం చూపే అధికారులు.. ఈ వ్యవహారంలో ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా సదరు నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చేతులెత్తేస్తారా.. అనేది వేచి చూడాల్సి ఉంది.